ప్రకృతి వనాలపై నిర్లక్ష్యం..!



వేమనపల్లిలోని పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

- నీటి తడులు అందించక ఎండుతున్న మొక్కలు
- నాటిన వాటిలో సగం కూడా ఎదగని వైనం
- పట్టించుకోని అధికారులు

గత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పల్లెలు, పట్టణాలు పచ్చగా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె, పట్టణ ప్రకృతి వనాలు జిల్లా వ్యాప్తంగా అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా ఎండిపోతున్నాయి. ఏటా లక్షల మొక్కలను నాటుతున్నా, అందులో సగం కూడా మొక్కలు బతకడం లేదు. వేసవి కాలం వచ్చిందంటే మొక్కలకు నీరందక, ఎక్కువగా ఎండిపోతున్నాయి. ఈ దుస్థితిని వివరిస్తూ కథనం...

బెల్లంపల్లి నియోజకవర్గంలో...

బెల్లంపల్లి: పల్లె ప్రకృతి వనాలు బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో తీవ్ర నిరాదరణకు గురవుతున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ భూములను గుర్తించి గ్రామగ్రామాన పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఆ వనాలు ఎవరికీ పట్టింపు లేకుండా పోయాయి. ప్రకృతివనాల్లో నాటిన మొక్కలకు వేసవిలో నీటి తడులు అందించకపోవడంతో ఎండి పోతున్నాయి. ఎండ తీవ్రతకు గురై నిర్జీవంగా తయారయ్యాయి. ప్రకృతి వనం చుట్టూరా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ఊడి పోయి మూగ జీవాల సంచారానికి నిలయంగా మారాయి. పూల మొక్కలు కానరాకుండా పోయి ఆహ్లాదకరమైన పరిస్థితులు ప్రకృతి వనాల్లో కనిపించడం లేదు. తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న ప్రకృతి వనాల సంరక్షణను గాలికి వదిలేయడంతో ఎందుకు కొరగాకుండా పోతున్నాయి. మండల, గ్రామ స్థాయి అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేక, పట్టింపు చేయక పల్లె ప్రకృతి వనాలు కల తప్పి దర్శనమిస్తున్నాయి. చాలా మట్టుకు ప్రకృతి వనాల ప్రధాన గేట్లకు తాళం వేసి ఉంటున్నాయి. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణులు డిమాండ్ చేస్తున్నారు.



బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామంలోని ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు



కాసిపేట మండలం సోమగూడెం (కె)లో..



దమ్మిరెడ్డిపేటలో...



టేకులపల్లిలో ఎదుగుదల లేని మొక్కలు



నీలాయిపల్లె ప్రకృతివనంలో కానరాని మొక్కలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో...



పట్టణ ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోయి, ఖాళీగా మారిన ప్రదేశం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు నీరు లేక ఎండిపోతున్నాయి. హరితహారంలో భాగంగా గత ప్రభుత్వం ఏటా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతూనే, పట్టణాల్లో పట్టణ ప్రకృతి వనాలు, పల్లెల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. ఇందుకోసం ఏటా నిధులను కేటాయిస్తున్నా, మొక్కలను సంరక్షించకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతి వనాలు 36 ఏర్పాటు చేయాల్సి ఉన్నా, 32 స్థలాలను గుర్తించి, అందులో 28 వాటిల్లో మొక్కలను నాటారు. పట్టణంలోని రోడ్ల పక్కన మొక్కలను నాటడంతో పాటు, పట్టణ ప్రకృతి వనాలను 2019-20లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. 1,95,600ల మొక్కలను నాటగా, రూ.15లక్షలు ఖర్చు చేశారు. 2020-21లో 2,85,690 మొక్కలను నాటగా, రూ.92లక్షలు, 2021-22లో 1,98,650 మొక్కలు నాటగా, 2.62 కోట్లు, 2022-23 సంవత్సరంలో 2,28,140 మొక్కలను నాటేందుకు రూ.65లక్షలు ఖర్చు చేశారు. ఇందులో 85శాతం మొక్కలు మాత్రమే బతికి ఉన్నట్లు అధికారులు చెబుతున్నా, సగానికి పైగా మొక్కలు నాటిన ఏడాదే ఎండిపోయాయి.



మంచిర్యాలలోని గ్రీన్‌సిటీ రాశివనంలో...



మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం

చెన్నూర్‌లో...



లంబడిపల్లిలోని ప్రకృతివనం

చెన్నూర్‌రూరల్: గత ప్రభుత్వం 30 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రారంభంలో ఉపాధిహామీ ద్వారా మొక్కల పెంపకం, వాటి నిర్వహణ చేపట్టారు. నిర్వహణ గడువు ముగియడంతో నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ నిధుల లేమి, సిబ్బంది కొరతతో సరైన నిర్వహణ లేక ప్రకృతివనాలు అధ్వానంగా మారుతున్నాయి. మొక్కలకు నీరు లేక ఎండిపోతున్నాయి.

మందమర్రిలో...



శంకర్‌పల్లి జీపీ శివారులో...

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంట, ఆదిల్‌పేట్, సారంగపల్లి, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలకు శంకర్‌పల్లి శివారులో 20ఎకరాలు భూమిలో సుమారు 50వేల మొక్కలు మూడు సంవత్సరాల క్రితం నాటి, నీళ్లు పోసి రెండు సంవత్సరాలు వాటిని పెంచారు. అనంతరం ఆ మొక్కల పోషణ బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిని పట్టించుకోకపోవడంతో మొక్కలు చనిపోయాయి.

నస్పూర్‌లో...

నస్పూర్: మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు ఫ్లడ్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి బృహత్ వనం నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారింది.

నీరు లేక ఎండిపోయిన మొక్కలు....

ప్రకృతి వనంలో మొక్కలకు నీరు అందక వేసవితాపంతో చాలా వరకు మొక్కలు ఎండిపోయాయి. ప్రకృతి వనంలో గ్లీనరీ ఏర్పాటుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రకృతి వనం పందులకు సంచార కేంద్రంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. ప్రకృతి వనంలో మందుబాబులు మద్యం సేవిస్తూ మందు సీసాలను అందులోనే వదిలి వేసినా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



ప్రకృతి వనంలో సంచరిస్తున్న పందులు

క్లుప్తంగా

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో అభ్యాస విద్యార్థులు



సర్టిఫికెట్ అందిస్తున్న నరేందర్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక అభ్యాస పాఠశాల విద్యార్థులు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవర్ గ్రహీత సాన సుధాతి ఆధ్వర్యంలో గురువారం 200 మంది (5 నుంచి 12 సంవత్సరాలు) విద్యార్థులకు 1000 పదాలను (3 నుంచి 12 లెటర్ పదాలు) 1000 సెకండ్లలో గుర్తించి పలకటంతో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ నరేందర్ గౌడ్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు చేశారు. వెయ్యి పదాలు వెయ్యి సెకన్లలో గుర్తించి పలకటం చాలా కష్టమని, పాఠశాల విద్యార్థులు, యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వరావు, కరస్పాండెంట్ గిరీష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయండి

మందమర్రిరూరల్: మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు తక్కువగా ఉన్నాయని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రాణాపాయం పొంచి ఉన్నందునా స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు అవసరాలని రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా బ్లడ్ అందిస్తుందని పేర్కొన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం, లోక్‌సభ ఎన్నికలు జరుగడంతో యువకులు బిజీ ఉండడం వలన రక్తదాతలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు, యువకులు, సింగరేణి యాజ మాన్యం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని ప్రకటనలో కోరారు.

ఆర్థికసాయం



బాధిత కుటుంబసభ్యులతో ఫొటోగ్రాఫర్లు

బెల్లంపల్లి(తాండూర్): అనారోగ్యంతో మృతి చెందిన తాండూర్ మండలానికి చెందిన ఫొటో గ్రాఫర్ పంబాల రమేష్ కుటుంబానికి గురువారం ఫొటో గ్రాఫర్ల రాష్ట్ర, జిల్లా సంఘం, ఇతరులు ఆర్థిక సాయం చేశారు. రూ.లక్ష 91వేలను బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులకు బాధిత కు టుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు నల్ల సతీ ష్, తాండూర్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి



కమలాకర్(ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లైజ నింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అవదూత కమలాకర్ (48) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, ఆ జిల్లా నుంచి మంచిర్యాల ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులకు దిశా నిర్దేశం చేసేందుకు డిప్యూటేషన్‌పై ఎంసీహెచ్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై సీనియర్ వాకర్ సభ్యుడిగాను గుర్తింపు పొందిన ఆయన మృతిపై రామునిచెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు.

మొగులు.. గుబులు



వేమనపల్లి: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులు వర్షం సూచనలు ఉండటంతో గురువారం సాయంత్రం దట్టమైన మబ్బులు కమ్ముకోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కళ్లాల్లో, వరిధాన్యం కేంద్రాల్లో రాసులుగా ఉన్న ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. టార్పాలిన్ కవర్లు కప్పి గాలికి లేవకుండా బరువులు పెట్టారు. గాలి దుమారంతో చిరుజల్లులు రాగా, రైతుల ఉరుకుల పరుగులు ఆందోళన కలిగించాయి.

ఘనంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు ఎవంజలీన్



మందమర్రిలో...

బెల్లంపల్లిరూరల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని బెల్లంపల్లి మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు తమ్మడి ఎవంజలీన్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ డెంగీ నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. మురికి నీటి ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు, రోడ్డు పై మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముందస్తు రక్షణ చర్యలు పాటించడంతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సమ్మయ్య, వైద్య సిబ్బంది శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి పాత బస్టాండ్ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు వీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన తలనొప్పి, జ్వరం లక్షణాలు కన్పిస్తాయన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల డిస్కం ఏఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ, మాదారం 11లైన్ కేవీ మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కా రణంగా మాదారం, పోచంపల్లి, నీలాయిపల్లి, అ బ్బాపూర్, నర్సాపూర్, బెజ్జాల, రేపల్లే వాడ, బోయపల్లి బోర్డు, ఐబీ గ్రామాల్లో ఉదయం 8-30గంటల నుంచి మధ్యాహ్నం 12-30గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్..



మంచి నీటి వృథా అరికట్టండి

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం రోడ్డులో గల రక్షిత మంచినీటిపథకం వాటర్ ట్యాంక్ వద్ద నీళ్లు వృథాగా పోతున్నాయి. వాటర్ ట్యాంక్‌లో నీళ్లు నిండిన అనంతరం గేట్‌వాల్వ్ బంద్ చేయాల్సి ఉండగా, సిబ్బంది దానిని చూడకపోవడంతో నీళ్లు నేల పాలవుతున్నాయని స్థానికులు తెలిపారు. ఒక వైపు మంచినీటి కోసం ప్రజలు నానా కష్టాలు పడుతుంటే, గ్రామ పంచాయితీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై సిబ్బందికి తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని నీటి వృథాని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : వేముల శ్రీనివాస్, కార్యదర్శి, భీమారం
ఫోన్ నంబర్ : 85558 98819

బాలింతలకు భోజనం, పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు వి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భోజనంతో పాటు, పండ్లు బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, ప్రొఫెసర్ డాక్టర్ వేదవ్యాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, డాక్టర్ కే. సుగుణాకర్ రెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ డేగ బాబు, జి. శ్యాంసుందర్‌రావు, ఎం. రామాంజనేయులు, వినయ్ కుమార్, గుండా శ్రీనివాస్, పి. హనుమంతరావు, పి. రాజేశ్వర్‌రావు, కొత్త సురేందర్ పాల్గొన్నారు.



భోజనం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వాముల వారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు దేవతామూర్తుల ప్రతిమలకు పంచామృత అభిషేకం, చండీయాగం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు మాట్లాడుతూ.. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 వరకు ఉంటాయని, భక్తులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందగలని తెలిపారు. ఆలయ అర్చకులు నర్సింహాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, అజయ్‌చార్యులు ఉన్నారు.